# విసేఫలం

వంటిళ్లలో పెళ్లాల పళ్లేల చప్పుళ్లకి మొగుళ్లు కళ్లు చిట్లించి పళ్లు నూరుకుంటూ కళ్లు తెరిచే వేళ! భళ్లున తెల్లవారి చాలాసేపైంది. 'అబ్బ... అప్పుడే ఏడు! రేపట్నించైనా ఎటలీస్ట్ ఆరింటికైనా నిద్దర్లేచి జాగింగ్‌కి వెళ్లాలి! బద్ధకంగా ఆవులిస్తూ లేచాను. ప్రసూనగానీ ఆ మాటలు వింటేనా? ఇంతెత్తున లేస్తుంది. "నా చిన్నప్పట్నించీ వింటున్నా ఈ కబుర్లు. సూర్యుడు ఏ దిక్కున ఉదయిస్తాడో ఒక్కసారైనా చూసిన మొహమేనా ఇది?" అంటూ... ఇలా తల్చుకున్నానో లేదో కిచెన్‌లోంచి కీచువాయిస్ వినబడ్డం మొదలైంది.

"ఏం నాయనా! తెల్లారలేదా ఇంకా నీకు? అరగంటలో బస్‌లో ఉండాలి తమరు. అర్ధరాత్రి దాకా అడ్డమైన మిడ్‌నైట్ ఛానల్సూ చూసేసి



పేరాల శ్రవణ్ కుమార్

నా నిద్ర కూడా పాడు చెయ్యడం, పొద్దున్న లేటుగా లేచి పెద్ద బిజీ అన్నట్టు జాగింగ్‌కి దుమ్మా కొట్టడం..."

లాభంలేదు... టాపిక్ మార్చకపోతే ఇదిలాగే టాపు లేపేస్తుంది అనుకుంటూ... "అబ్బ! సరేలే గానీ ముందు నీ చేత్తో ఓ కప్పు 'టీ' ఇవ్వు ప్రసూ. నీ చేతి టీ అంటే డెకడ్రాన్ ఇంజక్షనే అనుకో!" అంటూ అడ్డంగా పొగిడేసి, ఈనాడు పేపరు పట్టుకుని కూర్చున్నాను సోఫాలో.

"ఇదిగో ముందే చెప్తున్నా. పేపర్ చదువుతూ కూర్చుంటే ఊరుకోను. టీ తాగేసి వెంటనే రెడీ అయిపోవాలి!" టీ కప్ చేతికిస్తూ వార్నిం'గిచ్చిం ది' సతీమణి.

"అబ్బబ్బబ్బబ్బ! నుదుట ఆ చిరుచెమటలూ, ఆ చెమటల్లో తడిసిన ముంగురులూ, రొంటిన దోపిన కుచ్చెళ్ళూ... శ్రమైక జీవన సౌందర్యం అంటే నీదేనోయ్! అన్నట్టు పెసరట్లేస్తానన్నట్టు న్నావ్ ఇవాళ?..." అంటూ నడుముని సుతారం గా సవరించబోతున్న నా చేతిని విదిలించేస్తూ...

"ఆ చేత్తోటే కాస్తంత ఉప్మాకూడా తిప్పెయ్యి వోయ్! అద్దిరిపోతుంది మన ఇద్దరి కాంబినేషన్ లా!" ఇదేగా నీ నెక్స్‌ట్ డైలాగు? ఓ వారం జా గింగ్ చెయ్. ఓ అరకేజీ అన్నా బరువు తగ్గు. అప్పుడు చూద్దాం పెసరట్ల సంగతి. అంతవర కూ ఆయిల్ లేని అట్లే గతి. కాకాలు మాని కాలు కిందపెట్టి రెడీ అవు త్వరగా!" అంటూ కప్పు తీస్కుని, తిప్పుకుంటూ వెళ్ళిపోయింది ప్రసూన.

మాకింకా పిల్లల్లేరేమో నన్నే చిన్న పిల్లాడను కుంటూ మహా అలుసు చేసేస్తూ ఉంటుంది. తను రోజూ వెంటపడకపోతే నేను రోజూ టైమ్‌కి విజయనగరం వెళ్ళి ఆ కాస్త గవర్నమెంటు డాక్టర్ ఉద్యోగమూ సరిగ్గా చెయ్యనని ఆవిడ ప్రగాఢ నమ్మకం.

కాసేపు పేపరు తిరగేసానో లేదో సునామీలా వచ్చి, నా చేతిలోంచి పేపరు లాగెయ్యబోయింది ప్రసూన.

"సరే! నీ ఇష్టం... దినఫలాలు చదువుతు న్నా. అక్ఖర్లేదంటే చెప్పు. మానేస్తాను" సావధా నంగా పేపరు ముడిచేస్తూ అన్నాన్నేను.

ప్రసూన తెలుగువాళ్ళమ్మాయే అయినా... పెరిగిందీ, చదివిందీ కర్నాటక రాష్ట్రంలోని మంగుళూర్‌లో కావడంతో తెలుగులో మాట్లా డ్డం, పోట్లాడ్డం తప్ప చదవడం, రాయడంలో మాత్రం 'నిషానీ'యే. పైగా నాలాగే తనకీ దినఫ లాల పిచ్చి. రోజూ నేనే పేపర్లో దినఫలం చదివి ఆవిడగారికి వినిపించాలి.

"ఏదీ! నా రాశికేం రాశాడు? చదవ్వా శ్రవ ణ్ ప్లీజ్ ప్లీజ్!" అంటూ కాళ్ళ బేరానికి వచ్చి నా పక్కనే సెటిలయ్యింది.

"నీకా! ఇదిగో చదువుతున్నా. ఈ రోజు మీ శ్రీవారి మనసు కష్టపెట్టద్దు. భర్తంటే ఏంట నుకున్నారు? బనీను ధరించే బ్రహ్మాదేవుడు. ప్యాంట్ షర్ట్‌లో ఉండే పరమేశ్వరుడు. ఆయన్ని ఏవండీ అనండి! ఆయన ఏం అడిగినా, ఎప్పుడ డిగినా కాదనకండి...!!

"అందులో అలా ఏం రాయడు ఫో. నీవన్నీ అబద్ధాలే. నువ్వు హాస్పటల్‌కి వెళ్ళాక పక్కింటి ఆంటీ చేత చదివించుకుంటాలే..." మూతి బిగి స్తూ లేవబోయింది శ్రీమతి.

"అబ్బ! సరదాకన్నానుగానీ కూర్చోవోయ్! నీకు బాగానే రాసాడు ఎటొచ్చీ నాకే... కాస్త తేడాగా రాసాడు" అన్నాను సస్పెన్స్‌తో ఆమెని చంపేస్తూ.

ప్రసూన ముఖంలో రంగులు మారేయి.

ఆందోళనా మేఘాలు కమ్ముకున్నాయ్.

"ఏం రాసాడు? హెల్త్ బాగోదనా? చెప్పు శ్రవణ్. ప్లీజ్!" కంగారుగా అడిగింది. ఆ కంగారు, ఆ ఆందోళన చూస్తుంటే గర్వంగా అనిపించింది.

"హు! పిచ్చి ప్రసూ! నాకేం కాదు. డోన్ట్‌వర్రీ! నామీద ప్రేమే ఇదంతా!" ఆర్తిగా ఆమె చెంపలు సవరించాన్నేను ఆమె అనురాగానికి ముగ్ధుణ్ణయిపోతూ.

"అబ్బే! నీకేం దుక్కలా ఉన్నావ్. నీకేమవుతుందీ! మా భ్రమరక్కది కూడా నీ రాశే. పాపం దానిదసలే పిట్టశరీరం. పైగా మా అందరికీ దూరంగా ఎక్కడో న్యూజిలాండ్‌లో ఉందది. ఏం అవస్థలు పడుతోందోననీ..." అని దీర్ఘంతీసి, ఆనక తీరిగ్గా నాలిక్కరుచుకుంది దుంపలా పెట్టుకున్న నా మొహంచూసి.

ఆ విషయంలో కాసేపు నా అలకలూ, తన సారీలూ అయ్యేక అప్పుడు చెప్పేను ఆ రోజు నా దినఫలం. ఇవాళ నేను ఎవరితో ఏం మాట్లాడినా, అసలు మాట్లాడకపోయినా అపార్థాలు వస్తాయిట. అదీ సంగతి.

"అయితే కాస్త జాగ్రత్తగానే ఉండు శ్రవణ్. అసలే నువ్వు ఆలోచించకుండా వాగేస్తూ ఉంటావు కూడానూ. ఈ ఒక్కరోజుకీ కాస్త ఆలోచించి మాట్లాడు ఎందుకైనా మంచిది" గురువింద గింజలా నా మొఖాన ఓ సలహా పారేసింది ప్రసూన.

"ఎంత జాగ్రత్తగా ఉంటే మాత్రం రాత మార్చతరమా!" మెట్ట వేదాంతం వల్లిస్తూ టవల్ భుజాన వేస్కుని బాత్రూమ్‌లో దూరేను.

"నువ్వొస్తానంటే... నేనొద్దంటానా" జాలీగా ఖూనీ రాగం తీస్తూ సబ్బు అరగదీస్తున్నాను.

"నువ్వెందుకొద్దంటావు నాయనా! టైం దాటిపోయాక నువ్వొస్తానంటే మీ ఆర్.ఎమ్.ఓ. గారొద్దంటాడు. 'ఏ' సర్టిఫికెట్ ఇచ్చి మరీ ఇంటికి పొమ్మంటాడు". రిజస్టర్‌లో 'ఆబ్సెంట్' మార్క్ చేస్తారనడానికి ఆవిడ భాష్యం అది. నిష్ఠూరంగా అనిపించినా ఆవిడ చెప్పింది నిజమే. వేరే ఊళ్లో ఇల్లు కట్టుకోవడాన రోజూ పాతిక మైళ్ల దూరంలో ఉన్న విజయనగరానికి బస్సులో వెళ్లి, అక్కణ్ణించి ఓ మూడు కిలోమీటర్లు స్కూటర్ మీద వెళ్తేగానీ మా హాస్పటల్ రాదు. అందుకే ఫాస్ట్ ఫార్వర్డ్‌లో రెడీ అయిపోవడం మొదలెట్టాను. తీరా తల దువ్వుకుంటూంటే ఛెళ్లున కొట్టినట్టు గుర్తొచ్చింది.

"ప్రసూనా! అన్నట్టు ఇవాళ విజయనగరానికి సి.యం. వస్తున్నాట్ట. హాస్పిటల్‌కి అందరం అరగంట ముందే తగలడాలని మా బాస్ ఆర్డర్. అర్జంటుగా టిఫిన్ రెడీ చెయ్" సి.యం. అమ్మ మొగుళ్లా గావుకేక వేస్తూ హుకుం జారీచేసాను.

"అబ్బ! ఇప్పుడా చెప్పేది? పెనం కాలాలా? వద్దా? ఉండు మరి..." అంటూ హడావిడి పడిపోతోంది ప్రసూన.

"నో ఎక్స్‌ప్లనేషన్స్. హరియప్!" అంటూ రెండుసార్లు తొందర పెట్టాక, ఆదరాబాదరాగా ఓ ప్లేట్లో రెండు పెసరట్లూ, అంత చెట్నీ వేసి తీసుకొచ్చింది ప్రసూన.

"అమ్మదొంగా! ఇందాక పెసరట్టు లేదు పొమ్మన్నావ్!" ఆనందంగా పెసరట్టు చెట్నీలో నంచుకుంటూ ప్లేటుతో సహా బెడ్‌రూంలో కెళ్లి టీ.వీ. ఆన్ చేసాను. టీవీ ఎయిట్‌లో కన్నుల పండువుగా క్యాబరే... ముష్టేసినట్టు నాలుగైదు పీలికలు ధరించి విచ్చలవిడిగా గెంతుతున్నారు. నా పెసరట్లోకి ఉప్మాకన్నా గొప్ప కాంబినేషన్ దొరికినట్టై లొట్టలేసాన్నేను.

రాష్ట్రంలో తామరతంపరగా పెరిగిపోతున్న 'డాన్స్ బార్'ల మీద సెర్చ్‌లైట్ ప్రోగ్రాం అది. అహా! ఏం ప్రజాసేవ చేస్తోంది టీవీ ఎయిట్... అనుకుంటూ పెసరట్టుముక్క నమలడం మర్చిపోయి 'పిబరే క్యాబరే రసం' అనుకుంటూ చొంగకారుస్తూ టీవీ చూస్తున్నాను.

ఇంతలో శ్రీమతి కేక "ఇంకో పెసరట్టు రెడీ! వచ్చి తీసుకో!" అని.

ఎలా తెలుస్తుందో ఈవిడకి. మంచి సీన్ చూస్తున్నపుడే పిలుస్తుంది... సణుక్కున్నానుగానీ టీవీని వదిలి నా కళ్లూ కాళ్లూ కదల్లేదు.

ఇంతలో టీవీ సడెన్‌గా ఆఫ్ అయింది. పవర్ కట్టా అనుకున్నాను బాధగా. కాదు 'పవర్ ఫుల్ కట్' అన్నట్టు ఎదురుగా ప్రసూన ప్రత్యక్షమైంది... ఒక చేతిలో అట్లకాడ, మరోచేత్తో పిండిగరిటే పట్టుకుని, భద్రకాళిలా.

"ఏం బాబూ! డిస్టర్బ్ చేసానా? పెనం కాలిన్వరా మగడా అంటే సి.యం. ప్రోగ్రాం... పి.యం. ప్రోగ్రాం అంటూ చిందులు. ఇప్పుడు క్యాబరే డ్యాన్స్‌లు చూడ్డానికి టైమ్ ఎలా దొరికింది? అట్లకాడ ఇంకా వేడిగానే ఉంది ఖబడ్దార్!" ఆ వేడి డైలాగులకి 'పార్టీ అధ్యక్షురాలి ముందు ప్రైమ్మినిస్టర్లా' వణికిపోయేను. అంతలోకే తేరుకుంటూ...

"మైగాడ్! చూసావా అప్పుడే అపార్థాలు! ఏదో న్యూస్ కోసం టీవీ ఎయిట్ పెడ్తే అందులో ఏదో సెర్చ్‌లైట్ ప్రోగ్రాంలో ఏదో కాస్త చూపిస్తే, దానికి నేనా బాధ్యుణ్ణి? నేనేం ఎంటీవీ చూసానా? ఎఫ్‌టీవీ చూసానా?" అని డిఫెన్స్ ఆడుకుంటూనే ప్లేట్లో మిగిలిన అట్టు ముక్కని కిళ్లీలా బుగ్గన బిగించి బ్రీఫ్‌తో సహా ఫస్ట్‌ఫ్లోర్‌లోంచి దడదడా దిగేసేను నేను.

"ఇంతలో ఇవిగో బైక్ తాళాలు మర్చేపోయేవు. తీరా బస్సుదిగేక తెల్లమొహం వేస్తావ్!" అంటూ బాల్కనీలోంచి ప్రసూన నా మీదకి విసిరిన తాళాలు సరిగ్గా నా నెత్తిన పడబోతూండగా ఒడుపుగా తప్పుకుంటూ అన్నాను కోపంగా "అబ్బ! ఏంటి ప్రసూ మోటుసరసం. కాస్త ఉంటే నా బుర్రకి కన్నం పడేది".

"ఏం పర్వాలేదు బాసూ! లోపల డ్యామేజ్ అయ్యే పార్టులేం లేవు!" కొంటెగా అంటూ టాటా చెప్పింది తను. దటీజ్ ప్రసూన. మొగుడు చచ్చేంత టెన్షన్‌లో బిజీగా ఉన్నప్పుడే ఆవిడగారి హాస్యప్రియత్వం హద్దులు మీరుతుంది. ఎలాగో కోపం అణుచుకుంటూ బస్‌స్టాప్‌కి లగెత్తాను.

పెళ్లి ముహూర్తాల రోజులేమో బస్సులు కిటకిట్లాడిపోతూ ఆర్టీసీకి లాభాలపంటలు పండిస్తున్నాయ్. "చెయ్యి ఎత్తిన బస్సు ఆగును" స్లోగన్‌ని తల్చుకుని ముందే చెయ్యెత్తి నిలబడ్డాను. బస్సు ఆగినట్టే ఆగి తీరా ఎక్కుదామని కాలెత్తేసరికి హడావిడిగా తుర్రుమంది. ఈసారి ముందు జాగ్రత్త చర్యగా ఓ చెయ్యీ, ఓ కాలూ ముందే ఎత్తేసి, నటరాజ విగ్రహంలా ఫోజిచ్చి నిలబడి మరో బస్ రాగానే ఛకామని ఎక్కేసాను.

లక్కీగా ఒకే ఒక్క సీటు ఖాళీగా ఉంది బస్సులో. ఆ త్రీ సీటర్‌లో కిటికీ పక్కన బొద్దుగా, తెల్లగా ఉన్న ఓ ఇరవై ఏళ్లమ్మాయీ, అమె పక్కనే ఓ నలభై ఏళ్లాయనా కూర్చుని ఉన్నారు. అయన పక్కనే నేనూ ఇరుక్కుని కూర్చున్నాను.

కండక్టర్ తన లాలాజల ప్రసాదం అద్దిన టిక్కెట్లని అందరికీ ఇచ్చుకుంటూ వస్తున్నాడు. నేనిచ్చిన ఏభైనోటు బ్యాగ్‌లో కుక్కి, చిల్లర ముప్ఫయ్ ఎనిమిది రూపాయలూ దిగేటప్పుడు అడగమన్నట్టు మూకాభినయం చేసి రద్దీలో దూసుకుపోయాడు.

మళ్లీ మర్చిపోతానేమో అని కండక్టర్ ఇవ్వా

ల్సిన చిల్లరని "థర్టీ ఎయిట్... థర్టీఎయిట్... థర్టీ ఎయిట్...!! అని గొణుక్కుంటూ మననం చేస్కుంటూ కాలక్షేపం కోసం అలా కిటికీ వేపు బైటికి చూస్తున్నానో లేదో నా పక్కనే ఉన్న నలభై ఏళ్లాయన "అపార్థం" చేస్కోనే చేస్కున్నాడు. "ఏంటి మిస్టర్ ! థర్టీ ఎయిట్... థర్టీ ఎయిట్... అంటూ ఆ అమ్మాయికేసి చూస్తున్నావ్! పేద్ద హీరోననుకుంటున్నావా? కొల్తలు చెప్తున్నావు? ఖబడ్దార్! ఏమనుకుంటున్నావో..." అంటూ గొడవేస్కున్నాడు నాతో.

అమ్మో! దినఫలం పన్జేస్తోంది...

"చూడండిసార్. నా కసలే మతిమరుపని కండక్టర్ ఇవ్వాల్సిన చిల్లరని మనసులో మననం చేస్కుంటున్నా. కాలక్షేపం కోసం కిటికీలోకి చూస్తున్నా. అంతేగానీ ఆవిడ కొల్తలు నాకెలా తెలుస్తాయి చెప్పండి!" రోషంగా అన్నాను. దాం తో నోరు మూసేడు.

ఎందుకొచ్చిన అపార్థాలు? హాయిగా వీక్లీ చదువుకుంటే సరి. అనుకుంటూ వీక్లీ కోసం బ్రీఫ్‌కేస్ తెరిచాను.

"మీరు డాక్టరుగారా?" నా బ్రీఫ్‌కేస్‌లోకే చూస్తూ అడిగేడతను. బహుశా నా స్టెతస్కోప్ చూసుంటాడు.

> అందర్నీ ప్రేమించడమే నీకున్న బలహీనత అయితే ప్రపంచంలో నీకన్నా బలవంతుడు ఎవరూ లేరు.
>
> * * *
>
> మిత్రులతో పాటు శత్రువులను కూడా ప్రేమించు. ఎందుకంటే విజయం సాధించదంలో నీ మిత్రులు నీకు సహకరిస్తారు. అయితే నీవు విజయం సాధించడానికి బలమైన కారణం మాత్రం నీ శత్రువులే.

"అవును" అనగానే చాటంత మొహం పెట్టి తను కాస్త జరిగి నాకు మరో సెంటీమీటర్ చోటు పెట్టేడు ఉదారంగా. కాస్సేపయాకగానీ అర్థంకాలేదు అతని ఉదారతకి కారణం. "డాక్టర్ గారూ! మీకో పేషంట్ రెడీ!" అంటూ తన పక్కమ్మాయిని చూపిస్తూ మొదలెట్టేడు. "దీనికి బస్ ఎక్కిన దగ్గర్నించీ ఒకటే వాంతులు. ఎందు కంటారూ?" అంటూ.


పేషంట్ ముఖం చూసి డయాగ్నసిస్ చేయగల దిట్టనని ఎలా కనిపెట్టేడో! స్మార్ట్ ఫెలో! అనుకుని కాలర్ ఎగరేస్కుంటూ ఒక్కసారి ఆమె కేసి పరీక్షగా పరిశీలించాను. జడలో బుట్టెడు పూలూ, ఫెళఫెళమనే పట్టుచీరా, మోచేతుల్దాకా మొహమాటం లేకుండా వేస్కున్న మట్టిగాజులూ, అరచేతుల్నిండా మొహంమొత్తేలా మెహందీ డిజైనూ, మెళ్లో మెరిసిపోతున్న తాళిబొట్టుని మాటిమాటికీ చూస్కుంటూ మురిసిపోడాలూ... అంటే... కొత్తగా పెళ్లయిందన్న మాట! ప్లస్ వాంతులు! యా! షీ ఈజ్ ప్రెగ్నెంట్!

"కంగ్రాట్స్. మీరు తాత కాబోతున్నారు!" నవ్వుతూ అతని చెయ్యిపట్టుకు ఊపేసాను. నేనూహించినట్టు అతని మొహం చాటంత అవలేదు సరికదా సొట్టబోయిన చెంబులా కళ తప్పింది.

"ఈవిడ నా పెళ్లాం అండీ బాబూ!" అన్నాడు పళ్లు నూరుకుంటూ.

"ఓ! మీకు లేటు మ్యారేజీ, ఆవిడకి ఎర్లీ మ్యారేజీ అన్నమాట. ఐతే మరీ హ్యాపీ. మీరు ఏకంగా తండ్రే కాబోతున్నారు!" ఈసారి రెండు చేతులూ పట్టుకుని ఊపేసాను.

అయినా ఆయన మొహం చాటంత అవలేదు. ఓ పక్క ఎర్రగా, మరో పక్క నల్లగా కుళ్లుతున్న టమోటాలా మాత్రం మారింది. పక్కకి




తిరిగి అనుమానంగా భార్యకేసి చూస్తూ ఏదో అడిగేడు. ఇందాకట్నించీ కిటికీలోంచి చూస్తూ ఏవేవో కలల్లో తేల్తూ... ముసిముసి నవ్వుల్తో... ఏదో లోకంలో విహరిస్తున్నట్టున్న ఆ అమ్మాయి, భర్త సణుగుడు వింటూనే షాక్ తిన్నట్టుంది. ముద్దు ముద్దుగా ఏడుస్తూ భర్త బట్టతలమీద ఒట్టేసి అతని చెవిలో ఏదో అంది నాకేసి గుర్రుగా చూస్తూ. అతను ఆ అమ్మాయిని ఓదారుస్తూ నాతో గొడవేస్కున్నాడు "ఏం డాక్టర్వయ్యా! మా ఇద్దరికీ పెళ్లై ఇంకా పదిహేను రోజులు కాలేదు. అప్పుడే నా భార్య గర్భవతి అంటావా! మాలో మాకు గొడవలు పెడతావా! నిన్నూ..."

ప్రసూన ముందే చెప్పింది... కాస్త ఆలోచించి మాట్లాడరా నీ దినం బాలేదూ అని. నా తొందరపాటుకి నాలిక్కరుచుకుంటూ వాళ్లిద్దరికీ సారీల మీద సారీలు చెప్తుండగానే... నా అదృష్టం కొద్దీ బస్సు విజయనగరం కాంప్లెక్స్‌లోకి ఎంటరవడం, అదే సందని బస్‌లోంచి నన్ను నేను బైటికి గిరాటేస్కోవడం క్షణాలమీద జరిగిపోయేయి.

దుమ్ము లేపుకుంటూ పారిపోతున్న బస్సుని చూడగానే నా థర్టీ ఎయిట్ రుపీస్ చిల్లర గుర్తొచ్చి అబ్బా! అనుకున్నాను బాధగా.

'అమ్మ కండక్టరూ! చిల్లర ఇవ్వకుండానే పారిపోతావా? బస్ నెంబర్ గుర్తు పెట్టుకుని మరీ వచ్చి చిల్లర కలెక్ట్‌చేస్కోనూ! అనుకుంటూ పారిపోతున్న బస్ నంబర్ 'ఫార్టీ... ఫార్టీటూ... ఫార్టీ... ఫార్టీటూ..." స్పీడుగా మననం చేస్కుంటూ స్కూటర్ స్టాండ్ వేపు వెళ్తున్నాను.

నాకు నాలుగడుగుల ముందు లాఠీ ఊపుకుంటూ తన మానాన తాను వెళ్తున్న ఆ లేడీ ఎస్సై ఒక్కసారి విజయశాంతిలా గిరుక్కున వెనక్కి తిరిగి, కోపంగా లాఠీ నా డైరెక్షన్‌లో తిప్పుతూ... మీది మీది కొస్తున్నప్పుడు గానీ నా కర్థం కాలేదు... ఆవిడ కూడా నేను గొణుక్కుంటున్న బస్ నెంబర్‌ని తన కొలతలుగా అపార్థం చేసుకుందని!